# అప్రమత్తతతో విధులు నిర్వహించాలి

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి
- పోలీస్ అధికారులతో సమావేశం



ఆదిలాబాద్ డీఎస్పీ వీ ఉమేందర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

ఎదులాపురం, అక్టోబర్ 17 : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ప్రతి ఒక్కరూ 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ చెక్‌పోస్టుల వద్ద మరింత పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం, ఇతర సామగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా 10 చెక్‌పోస్టులను వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా అంతటా బెల్టు షాపులను నిర్వహించకుండా పూర్తి అడ్డుకట్ట వేయాలన్నారు. పాత పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులను చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు.

### డీఎస్పీలకు ప్రశంసాపత్రాలు అందజేత

ఆగస్టు నెలలో వర్టికల్స్ నందు ఉత్తమ ప్రతిభ, గణేశ్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు ముగ్గురు డీఎస్పీలకు డీజీపీ కార్యాలయం వద్ద నుంచి వచ్చిన ప్రశంసాపత్రాలు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డీఎస్పీ వీ ఉమేందర్, ఉట్నూర్ డీఎస్పీ సిహెచ్ నాగేందర్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే ఆగస్టు నెలలో ప్రతిభ కనబరిచిన 16 మంది పోలీసు అధికారులకు నగదు రివార్డులతో ప్రశంసించి అభినందనలు తెలిపారు. రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీమార్గాల ద్వారా కేసులను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఆర్ఐలు, ఐటీ కోర్ ,ఎస్బీ, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

# బాదనకుర్తి చెక్‌పోస్టులో రూ.లక్ష సీజ్



పట్టుబడిన నగదు రూ. లక్షతో అధికారులు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 17 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బాదనకుర్తి చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ఎస్ఎస్‌టీ టీం వాహనాల తనిఖీలు చేశారు. నాందేడ్ నుంచి విజయ్ పవార్ అనే వ్యక్తి కారులో రూ.లక్ష తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఎస్‌టీ టీం అధికారి పీఎల్ఎన్ స్వామి, సిబ్బంది మహేశ్ ఉన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో పెరిగిన ప్రసవాలు

- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ప్రోత్సాహకాలతో సత్ఫలితాలు




నిర్మల్ ఎంసీహెచ్ దవాఖాన



సాధారణ ప్రసవానికి గర్భిణులకు యోగాసనాలు చేయిస్తున్న వైద్యురాలు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపెడుతోంది. మాతా శిశు సంరక్షణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం అందిస్తుండడంతో ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పేదలు ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు చేసుకునేందుకు ప్రోత్సహిస్తుండడంతో ప్రసవాలు పెరుగుతున్నాయి.

**ప్రభుత్వ ప్రోత్సాహకాలు:**

◆ గర్భిణులకు రక్తహీనత నివారించడంతో పాటు బలమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నారు.

◆ కేసీఆర్ కిట్, పథకం కింద నమోదు చేసుకున్న మహిళలకు మగబిడ్డ పుడితే రూ.12వేలు, ఆడ బిడ్డ పుడితే రూ.13 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ప్రసవానంతరం 15 వస్తువులతో కూడిన కిట్‌ను అందిస్తున్నారు.

◆ గర్భిణి సమయంలో వైద్యుల సంప్రదింపులకు ప్రసవానంతరం ఇంటికి వెళ్లేటప్పుడు, చిన్నారులకు టీకాల కొరకు దవాఖానలకు ఉచితంగా రాకపోకలకు అమ్మ ఒడి(102) వాహనాలను ఏర్పాటు చేసింది.

### గణనీయంగా ప్రసవాలు

జనవరి నుంచి ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో 3287 ప్రసవాలు జరిగాయి. ఇందులో 1112 సాధారణ ప్రసవాలు, 2175 ఆపరేషన్లు జరిగాయి. ఎక్కువగా సాధారణ ప్రసవాలు చేసేందుకు వైద్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యవసరమైతేనే ఆపరేషన్లు చేస్తున్నారు. నిర్మల్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు భైంసా, పలు దవాఖానల్లో ప్రసవాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. డాక్టర్లు, పిల్లల వైద్య నిపుణులు రోగులకు సేవలందిస్తున్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతి నిత్యం దవాఖానలో 200 నుంచి 400 వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. రిస్కుతో కూడుకున్న ఆపరేషన్లు సైతం చేస్తున్నారు. నిర్మల్ ఎంసీహెచ్ దవాఖానలో పిల్లల వైద్యులు, గైనకాలజిస్టులు, అనస్థీషియా, రేడియాలజిస్టు, వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారు. ఎంసీహెచ్‌లో 50 పడకల దవాఖాన అయినప్పటికీ స్థాయిని మించి ప్రసవాలు జరుగుతున్నాయి.



ఎంసీహెచ్‌లో బాలింతల వార్డు

### చిన్నారులకు మెరుగైన వైద్యం

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందిస్తున్నారు. బరువు తక్కువగా జన్మించిన పిల్లలను ప్రత్యేక వార్డులో ఉంచుతున్నారు. ఒక కేజీ బరువుతో పుట్టిన చిన్నారులను సైతం వార్మర్స్‌లో ఉంచుతున్నారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత డిశ్చార్జి చేస్తున్నారు. పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు.

### పైసా ఖర్చు లేకుండా వైద్యం



మాది బోథ్ మండలం బాబెర తండా గ్రామం మూడో కాన్పు సమయంలో ప్రతి నెలా వైద్య పరీక్షలకు నిర్మల్ ఎంసీహెచ్‌కు వచ్చాను. ఇక్కడ వైద్యులు చాలా చక్కగా చూసుకున్నారు. పరీక్షలు చేసి సాధారణ ప్రసవం అవుతుందని చెప్పారు. వ్యాయామం చేయించి సాధారణ ప్రసవం చేశారు. బాబు పుట్టాడు. నేను బాబు ఆరోగ్యంగా ఉన్నాం. ప్రైవేట్ దవాఖానకు వెళ్తే రూ.40 వేల దాకా ఖర్చయ్యేది. ప్రభుత్వ దవాఖానలో పైసా ఖర్చు లేకుండా ప్రసవం చేశారు. కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు అందించారు. నగదు ప్రోత్సాహకం వస్తుందన్నారు. దవాఖానలో అన్ని వసతులు ఉన్నాయి. వైద్యులు బాగా చూస్తున్నారు.

-జాదవ్ సరిత, బాలింత, బాబెరతండా

# కలిసి ఎదుగుదాం.. ప్రకృతిని రక్షిద్దాం



మొక్కలు నాటుతున్న వీసీ వెంకటరమణ, విద్యార్థులు

బాసర, అక్టోబర్ 17 : కలిసి ఎదుగుదాం ప్రకృతిని రక్షిద్దామని బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలోని చిల్డ్రన్ పార్క్, వీఐపీ గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాల్లో మామిడి, జామకాయ పండ్ల రకాల మొక్కలు డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్ కుమార్‌తో కలిసి నాటారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు ఆహారాన్ని అందించే వృక్షాలను సంరక్షించ కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ఎకో పార్కు అభివృద్ధి చెందడంతో పచ్చని తోరణంలా ఆర్జీయూకేటీ నిలయంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో సెక్యూరిటీ సిబ్బంది సీఐ రాకేశ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సతీశ్ రెడ్డి, అధ్యాపకులు శ్రీశైలం, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి రగ్బీ క్రీడాపోటీలకు ఆర్జీయూకేటీ విద్యార్థి ఎంపిక

బాసర, అక్టోబర్17: ఆర్జీయూకేటీ విద్యార్థి జాతీయ స్థాయి రగ్బీ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు వీసీ వెంకటరమణ తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లోని యతిరాజరావు మైదానంలో నిర్వహించిన 67వ జాతీయ స్థాయి అండర్-19 బాల బాలికల రగ్బీ పోటీల్లో పాల్గొని డీ ఉదయ్ కుమార్ పీయూ రెండవ సంవత్సరం చదువుతున్న ఆర్జీయూకేటీ విద్యార్థి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సతీశ్ కుమార్‌తో కలిసి వైస్ చాన్సలర్ వెంకటరమణ విద్యార్థికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ పీడీ శ్యాంబాబు, రవికిరణ్, స్వప్న, వసంత రఘు, స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

# ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం విస్తృత తనిఖీలు

దస్తురాబాద్,అక్టోబర్ 17 : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. దస్తురాబాద్‌లో పర్యటిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మా బొజ్జు వాహనాన్ని, బీజేపీ నాయకుడు రాథోడ్ రితీశ్ వాహనాన్ని తనిఖీ చేశారు. దాదాపు 25 వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. రూ 50 వేల కంటే డబ్బులు వెంట తీసుకెళ్తే ఆధారాలు, పత్రాలు చూపించాలని, అలాగే ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అక్రమ మద్యం, డబ్బులు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎంపీవో చంద్రశేఖర్, ఏఎస్ఐ రాంచందర్, కానిస్టేబుల్ రాజేశ్వర్ పాల్గొన్నారు.



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మా బొజ్జు వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం